# మనగొప్ప చెప్పతరమా !

నిజానికి మన గురించి మనం గొప్పగా చెప్పుకోవడం బాగోదు. ఈ సంగతి తెలిసీ మనం అలా చెప్పుకోకుండా ఉండలేం. అంటే, అత్మస్తుతిలో అంత ఆనందం ఉందన్న మాట!

పోతన తన భాగవతాన్ని ఏ రాజుకీ అంకితం ఇవ్వడానికి ఒప్పుకోకుండా దేవుడికే అంకితం చేసినందుకు మనం గర్విస్తాం. "కాటుక కంటినీరు............." అంటూ సరస్వతీ దేవి గురించి పోతన వర్ణించినందుకు మెచ్చుకుంటాం. సరస్వతీదేవి కంటనీరు పెట్టుకుంటే, ఆమె వక్షోజాల వర్ణనెందుకని నొచ్చుకోం.

భక్తిలో కూడ ఎంత గొప్పగా రక్తిని ముడిపెట్టారో కవి గారని భజన చేస్తాం.

ప్రబంధాల్లో ఎందరో మహాకవులు కావ్య నాయకిల అంగాంగ వర్ణనలు చేసినప్పుడు చొంగలు కార్చుకుంటూ మహదానందపడి పోతాం.

పార్వతీదేవిని కాళిదాస మహాకవి పచ్చిపచ్చిగా వర్ణించినప్పుడు వెచ్చవెచ్చని కోర్కెలతో ముసిముసి నవ్వులతో మురిసి పోతాం. కాళిదాసుని మించిన కవి లేడని కితాబులిచ్చేస్తాం.

"హరిరిహ ముగ్ధవధూనికరే విలాసిని విలసిత కేళిపరే... కేళి చలన్మని కుండలమండిత గండస్మిత యుగశాలీ......" అంటూ జయదేవుని గీతాలు పాడుకుంటూ భక్తి పారవశ్యంతో ఓలలాడిపోతాం. శ్రీకృష్ణుడి శృంగారాన్ని నగ్నంగా వర్ణించిన ఆ కవిగారిని అజ్ఞానంతో భక్త జయదేవుడంటూ భజనలు చేస్తాం.

"మధు సాహిత్యాన్ని" దొంగచాటుగా చదువుకుంటూ లుంగలు తిరిగిపోతాం. అవి అందుబాటులో లేకపోతే, వారపత్రికల సెంటర్ స్ప్రెడ్‌లలో తలదూర్చి సలసలకాగిపోతాం.

టీవీల ముందు కూర్చుని ఏదైనా పాత సినిమా వస్తే 'బోర్' అనుకుంటూ సరికొత్త సినిమా కోసం మరో చానల్ మార్చి కొద్దిపాటి గుడ్డలతో తైతెక్కలాడే హీరోయిన్‌ను చూస్తూ గుటకలు వేస్తాం.

అదీ కాకపోతే విదేశీ ఛానల్‌కు మార్చి ఇంగ్లీషు సినిమాల్లోని ముద్దు దృశ్యాలు చూస్తూ పెదాలు తడుపుకుంటాం. పడక దృశ్యాల్ని కళ్లింతింత చేసుకుని చూస్తూ ప్రకంపించిపోతాం. విదేశీ తెల్లసుందరి బట్టలన్నీ విప్పేసి బాత్‌రూమ్‌లోని స్నానాల తొట్టెలోకి దిగితే, తెల్లబోతూ చొంగ కార్చుకుంటూ అలాంటి మరో దృశ్యంకోసం భాష అర్థంకాకపోయినా సినిమా అంతా ఎంతో ఓపిగ్గా చూసితీరతాం.

ఇన్ని చేస్తూ నలుగురిలోకొచ్చి భారతీయ సంస్కృతీ వైభవాల గురించి చిలువలూ పలువలూ చేస్తూ గొప్పలు చెబుతాం.

హిందూ సంస్కృతిని విదేశీ సంస్కృతి హరించి వేస్తోందంటూ బోలెడు విచారపడి పోతాం.

రాజా రవివర్మ దేవతల తైలవర్ణ చిత్రాల గురించి పొగుడుతూ, ఎంఎఫ్ హుస్సేన్ దేవతల్ని సెక్సీగా చిత్రించాడంటూ విమర్శల విల్లును ఎక్కుపెడతాం. శివసేన రూపంలో శివమెత్తిపోతాం. హుస్సేన్ ఆర్ట్‌గాలరీని ఛిన్నాభిన్నం చేస్తాం. అతని ఇంటి అద్దాలు పగలగొడతాం. అతను గీసిన చిత్రాల్ని చింపేస్తాం. పెయింటింగుల్ని ధ్వంసం చేస్తాం. పత్రికల పతాక శీర్షికలకెక్కి భారతీయ సంస్కృతి పరిరక్షకులుగా ప్రచారం చేసుకుంటాం.

అశ్లీల సినిమాల్ని నిషేధించాలంటూ అప్పుడప్పుడూ మహిళా సంఘాల రూపంలో నిరసన ప్రదర్శనలు చేస్తాం. వేదికలెక్కి ఉపన్యాసాలు దంచుతాం. ఆ తర్వాత మౌనమే భూషణమనుకుంటాం.

మగమహారాజుల రూపంలో ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తున్నందుకు 'అల్లుడా మజాకా' అనుకుంటూ ఆనందపడిపోతాం.

హీనక్షీణ సంస్కృతి నగరాల్లోనే నగ్న నృత్యం చేస్తోందనీ, పల్లె సీమలు పచ్చని పొలాలతోనే కాదు పచ్చని భారతీయ సంస్కృతిలో విరాజిల్లుతున్నాయనీ నమ్ముతూ 'పల్లె సీమలు మన భాగ్య సీమలురా' అంటూ పాటలుపాడుకుంటాం. అక్కడా విదేశీ చానళ్ల వీరవిహారం చేస్తున్న సంగతి మరిచిపోతాం.



తెరపైనో, కాగితంమీదో కదిలే, కదలని బొమ్మలు చూస్తూ ఆనందపడిపోయే ఎందరమో ప్రశాంతతకు నిలయమనుకునే పల్లెటూళ్లలో ఏకంగా సజీవ సుందరులే బట్టలూడదీసి, కైపు పాటలకు అనుగుణంగా నాట్యమాడుతూంటే ఒళ్ళు మరిచి కళ్ళు తెరిచి బహు ఖుషీ అనుభవిస్తున్నారని తెలిస్తే తెగ అసూయపడిపోతాం.

గుంటూరు, ప్రకాశం మొదలైన జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లో రికార్డింగ్ డ్యాన్సుల పేరిట ట్రాక్టర్ తొట్టెలే వేదికలుగా చేసుకుని కొందరు ఆడవాళ్ళు నగ్న నృత్యాలు చేస్తోంటే పిచ్చిపిచ్చిగా చూస్తూ ఈల వేస్తున్నాం. ఒకో బట్టా విప్పుతూంటే లొట్టలేసుకుంటున్నాం. అన్నీ విప్పేసేక ఓ తువ్వాలు చుట్టుకుని మధ్యమధ్య దాన్ని వదిలేస్తూ డ్యాన్స్ చేస్తుంటే మైమరిచిపోతున్నాం. పోలీసులూ ప్రభుత్వమూ అలాంటి నృత్యాల్ని అడ్డుకోకుండా ఆదమరిచి నిద్రపోతున్నందుకు తన్మయత్వం చెందుతున్నాం.

'జిస్ దేశ్మే కాముక్తా బహతీహై' అని కోరస్‌లో పాడుకుంటున్నాం.

మన గొప్పలు ఎన్ని చెప్పినా ఇంకొన్ని మిగిలే ఉంటాయి.

మనందరి ముందు గుడ్డలూడదీసుకుని గెంతులేసే ఆడది మన ఆనందం కోసం అలా ఎందుకు చేయాల్సి వస్తోందో ఏ తీరని ఆకలి ఏ తీరని శోకం ఆమె చేత నిస్సిగ్గుగా అలా చేయిస్తోందో- ఏ ప్రభుత్వాలు, ఏ వ్యక్తులు, ఏ నాయకులు 'ఆమె'ను అలాంటి దుస్థితిలో ఉంచారో మనం కొంచెం కూడా ఆలోచించనంతటి గొప్పవాళ్లం (అవును, మనకు మనమే శాల్యూట్ చేసుకునేటంత గొప్పవాళ్లం!)

**22.5.98**, వార్త దినపత్రిక